నీటి బొట్టు .. ఒడిసి పట్టు




జీవ కోటికి నీరే ప్రాణధారం. అలాంటి నీటిని ఒడిసి పట్టి సాగు నీటి వనరుగా మలుచుకోవడానికి మిరుదొడ్డిలోని రైతులు కొత్త పుంతలు తొక్కుతున్నారు. బోరు మోటార్లతో బావుల్లో నీటిని నిల్వ చేసుకుంటున్నారు. వ్యవసాయ బోరు బావుల నుంచి గ్యాపుల అనంతరం వచ్చే నీటి ధారలతో పాత బావులను నింపుతున్నారు. పంటలకు ఒకే సారి నీటిని సమంగా అందించడానికి నిల్వ ఉన్న బావుల్లోని నీటిని వినియోగిస్తున్నారు.

– మిరుదొడ్డి(దుబ్బాక)

ఆరుతడి సాగు.. బహుబాగు



తొగుట మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఆరుతడి పంటలు పండిస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో లాభాలు అర్జిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వానాకాలంలో మొక్కజొన్న పంట సాగుచేసిన రైతులు యాసంగిలో రెండో పంటగా మొక్కజొన్న, పొద్దు తిరుగుడు, జీన్స్, కూరగాయల వంటి ఆరుతడి పంటలు సాగుచేస్తున్నారు. సుమారు మూడు వేల ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగుచేస్తున్నట్లు సమాచారం.

– తొగుట(దుబ్బాక)

శిథిలం.. భయం భయం!



దౌల్తాబాద్ మండల పరిధిలోని గాజులపల్లిలో 28 ఏళ్ల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. ట్యాంకు పెచ్చులు ఊడి కింద పడుతుండగా.. ఇనుప చువ్వలు బయటకు తేలాయి. చాలా కాలంగా నీరు లీకేజీ కావడంతో నాచుపట్టింది. అయినప్పటికీ ప్రజలకు నీటి కొరత రాకుండా నిత్యం ఈ ట్యాంక్ నుంచే నీటి సరఫరా చేస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి ట్యాంక్‌ను కూల్చి కొత్తది నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

– దౌల్తాబాద్(దుబ్బాక)

క్లుప్తంగా

వైద్య రంగంలో రాష్ట్రం ముందంజ



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

చేర్యాల(సిద్దిపేట): వైద్యరంగంలో రాష్ట్రం ముందంజలో ఉందని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. పట్టణ కేంద్రంలోని గాంధీ సెంటర్ సమీపంలో డాక్టర్ ఎడెల్లి సంతోష్‌కుమార్ ఏర్పాటు చేసిన అక్షర ఆస్పత్రిని ఆదివారం జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజలకు అందుబాటులో పట్టణ కేంద్రంలో అత్యాధునిక వసతులతో ఆసుపత్రి ఏర్పాటు చేసిన వైద్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ శ్వేత, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఆకాష్‌వర్ధన్, ఆస్పత్రి డైరెక్టర్ చల్ల సంతోష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను సన్మానిస్తున్న కురుమ సంఘం నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆలేరు ఎమ్మెల్యేగా విజయం సాధించిన బీర్ల ఐలయ్య కురుమను సిద్దిపేట కురుమ సంఘం నాయకులు హైదరాబాద్‌లోని కలిసి సన్మానించినట్లు కురుమ సంఘం జిల్లా కార్యదర్శి కంతుల రమేష్ తెలిపారు. కురుమల నుంచి ఏకైక ఎమ్మెల్యేగా విజయం సాధించిన బీర్ల ఐలయ్య కురుమను సన్మానించి, అభినందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సిద్దిపేట కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోరే ఎల్లయ్య, యువత జిల్లా అధ్యక్షుడు కోటగిరి ప్రభాకర్, నాయకులు యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

కొండపోచమ్మ ఆలయంలో భక్తుల సందడి

జగదేవ్‌పూర్(గజ్వేల్): కొమురవెల్లి మల్లన్న కల్యాణోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం మల్లన్న కల్యాణోత్సవంలో పాల్గొని మధ్యాహ్నం భక్తులు వందలాది సంఖ్యలో కొండపోచమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

యువత క్రీడల్లో రాణించాలి

మర్కూక్(గజ్వేల్): క్రీడాకారులు దేశస్థాయిలో రాణించాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి అన్నారు. మండలంలోని పాములపర్తిలో మండల స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో ఆదివారం గంగాపూర్, పాములపర్తి జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గెలుపోటములు సమానంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ బీసీ సెల్ మండలాధ్యక్షుడు కనకయ్య, ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ప్రజాపాలన దరఖాస్తులు

హుస్నాబాద్: పట్టణంలో ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్న ప్రక్రియను అధికారులు ఆదివారం కూడా కొనసాగించారు. గత నెల 28 నుంచి జనవరి 6 వరకు ఆరు గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ పూర్తి చేశారు. మొత్తం 6,919 దరఖాస్తులు స్వీకరించగా, వాటిని ఆన్‌లైన్‌లో పొందుపరిచే ప్రక్రియను కొనసాగిస్తున్నారు. మున్సిపల్ కార్యాలయంలో తగినన్ని కంప్యూటర్లు లేకపోవడంతో పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలోని కంప్యూటర్లలో ఆన్‌లైన్ చేపట్టారు. మున్సిపల్ ఆర్‌ఐ కృష్ణ పర్యవేక్షించారు.

వెల్లువెత్తిన దరఖాస్తులు

నంగునూరు(సిద్దిపేట): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి అన్నివర్గాల ప్రజల నుంచి భారీ స్పందన లభించింది. మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు గాను ఇప్పటి వరకు మొత్తం 12,953 దరఖాస్తులు రాగా కొత్తరేషన్ కార్డులతో పాటు ఇతర అవసరాల కోసం మరో 3,405 దరఖాస్తులు వచ్చాయి. తహసీల్దార్ కార్యాలయంలో 16 మంది, ఎంపీడీఓ కార్యాలయంలో 13 మందితో డేటా ఎంట్రీ చేయిస్తున్నారు. ఎంపీడీఓ, తహసీల్దార్, ఆర్‌ఐతో పాటు పంచాయతీ కార్యదర్శులు ఆన్‌లైన్ ప్రక్రియను పర్యవేక్షిస్తూ గడువులోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.



హుస్నాబాద్: ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న ఆపరేటర్లు

మంత్రి 'పొన్నం'ను కలిసిన కాంగ్రెస్ నేతలు

చిన్నకోడూరు(సిద్దిపేట)/మిరుదొడ్డి(దుబ్బాక): రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆదివారం సిద్దిపేటలో యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు అజ్జు యాదవ్ ఆధ్వర్యంలో పలువురు కలిశారు. మండలానికి సంబంధించిన పలు సమస్యలు మంత్రికి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీలను అర్హులకు అందే విధంగా గ్రామస్థాయిలో ప్రతి కార్యకర్త పని చేయాలని మంత్రి సూచించారు. అలాగే మిరుదొడ్డి మండల పార్టీ నాయకులు మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రిని కలిసిన వారిలో అల్వాల సర్పంచ్ ఎనగంటి కిష్టయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మద్దెల రాజేష్, ఉపాధ్యక్షుడు ఎండీ. అర్షద్, తదితరులు ఉన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌తో యూత్ కాంగ్రెస్ నాయకులు

రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జగదీశ్వర్‌యాదవ్ తదితరులు

గజ్వేల్: ఈనెల 11 నుంచి 14 వరకు గజ్వేల్ పట్టణంలో నిర్వహించనున్న 49వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల ఏర్పాట్లను ఆదివారం రాష్ట్ర ఒలింపిక్, కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌యాదవ్, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా మైదానంలో కబడ్డీ కోర్టుల ఏర్పాటు, అతిథులకు వసతి తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పోటీల్లో వెయ్యి మందికి పైగా క్రీడాకారులు, 200 మంది ప్రముఖులు, మరో 300 మంది జిల్లా కబడ్డీ అసోసియేషన్ ముఖ్యులు పాల్గొంటారని నిర్వాహకులు వివరించారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేసన్ తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవికుమార్, అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారులు మద్ది మహేందర్ రెడ్డి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శివకుమార్, కోశాధికారి సత్యం పాల్గొన్నారు.

దాచారంలో ముగ్గుల పోటీలు

బెజ్జంకి(సిద్దిపేట): స్వామి వివేకానంద జయంతి సందర్భంగా మండలంలోని దాచారంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు కొలిపాక రాజు ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన మహిళలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డి, నాయకులు అజయ్‌వర్మ, సుజాతరెడ్డి, దీటి రాజు, లక్ష్మణ్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం

హుస్నాబాద్: పట్టణంలోని ఆదర్శ హమాలీ సంఘం గౌరవ అధ్యక్షుడిగా సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్యను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా శివయ్య మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి వారి సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

నగర సంకీర్తన

జహీరాబాద్ టౌన్: హరేరామ హరేకృష్ణ సంస్థ ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం నగర సంకీర్తన నిర్వహిస్తున్నారు. ఆదివారం పట్టణంలోని పస్తాపూర్ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంతంలో నగర సంకీర్తన నిర్వహించారు. ఇందులో అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు. భజనలు, కీర్తనలు ఆలపిస్తూ పాదయాత్ర నిర్వహించారు.

చికిత్స పొందుతూ నిండు గర్భిణి మృతి

గజ్వేల్‌రూరల్: ప్రసవం కోసం ఆస్పత్రికి వెళ్లిన ఓ నిండు గర్భిణి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ అండ్‌ఆర్ కాలనీ(పల్లెపహాడ్)లో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రంగ భవాని–కృష్ణ దంపతులకు ఒక కూతురు ఉంది. 4వసారి గర్భం దాల్చిన భవాని గజ్వేల్‌లోని ప్రభుత్వాసుపత్రిలో కొద్ది నెలలుగా చికిత్స పొందుతుంది. ఈక్రమంలో అస్వస్థతకు గురికావడంతో ఆదివారం గజ్వేల్‌లోని ప్రభుత్వాసుపత్రికి వచ్చింది. పరీక్షించిన వైద్యులు లోబీపీతో పాటు ఆక్సిజన్ లెవల్ తక్కువగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించాలని సూచించారు. వెంటనే కుటుంబీకులు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. గర్భంలోని శిశువు సైతం చనిపోయింది.

సంక్షిప్త వార్తలు

◆ **రాంచంద్రమూర్తి సేవలు మరువలేనివి**

కొండపాక(గజ్వేల్): గ్రామంలో ఆధ్యాత్మిక సేవలు పెంపొందించడంలో స్వయంభు శంభు దేవాలయ ట్రస్టు చైర్మన్ గొల్లపట్టి రాంచంద్రమూర్తి కృషి మరువలేనిదని సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని దుద్దెడలో రాంచంద్రమూర్తి సంస్మరణ సభను దేవాలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా రాంచంద్రమూర్తి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రధాన కార్యదర్శి మంచాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పెద్దంకుల శ్రీనివాస్, అనంతుల నరేందర్, ఉపసర్పంచ్ గుండెల్లి అంజనేయులు, సభ్యులు పాల్గొన్నారు.

◆ **రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు**

తొగుట(దుబ్బాక): గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన తొగుటలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన సత్తు నవీన్ (26) గజ్వేల్ పట్టణంలోని ఓ ఫైనాన్స్ సంస్థలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. విధి నిర్వహణలో భాగంగా శనివారం రాత్రి పని ముగించుకుని ద్విచక్రవాహనంపై తొగుటకు తిరిగి వస్తుండగా గ్రామ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. గమనించిన వాహనదారులు కుటుంబీకులకు సమాచారం అందించారు. తీవ్రంగా గాయపడిన నవీన్‌ను కుటుంబీకులు చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

◆ **ప్రజాపాలన నిరంతర ప్రక్రియ**

దౌల్తాబాద్(దుబ్బాక): ప్రజా పాలన నిరంతర ప్రక్రియ అని దౌల్తాబాద్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు పడాల రాములు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తుందని పేర్కొన్నారు.

◆ **విరాళం అందజేత**



దౌల్తాబాద్(దుబ్బాక): మండల కేంద్రంలో స్వామి వివేకానంద విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం ఆదివారం దౌల్తాబాద్ గ్రామ వివేకానంద యూత్ సభ్యులు రూ. 20 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు ప్రశాంత్, నరేష్, మణికంఠ, పవన్, మహేష్, యశ్వంత్, శేఖర్, పవన్, కళ్యాణ్, రత్నం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

◆ **మహిళ ఆచూకీ లభ్యం**

దుబ్బాకరూరల్: మండలంలోని హబ్సిపూర్‌కు చెందిన మెర్గు భారతమ్మ (55) ఈనెల 5వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం పోలీసులు, బంధువులు సోషల్ మీడియాలో మహిళ ఫొటోను వైరల్ చేయడంతో ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఉన్నట్టు తెలిసిందని ఎస్‌ఐ గంగరాజ్ తెలిపారు.

◆ **క్యాలెండర్ ఆవిష్కరణ**

నర్సాపూర్: బంజారా ఎంప్లాయిస్ సేవాసంఘ్ ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆవిష్కరించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సంఘ్ జిల్లా అధ్యక్షుడు రాంచందర్, ప్రధాన కార్యదర్శి మనిరాం రాథోడ్, దేవీసింగ్, ఈశ్వర్, చెన్నానాయక్, గణేశ్, చందర్, మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

◆ **సేవాలాల్ జయంతిని సెలవుగా ప్రకటించాలి**

నర్సాపూర్: గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలా ల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు వినతిపత్రం అందజేసినట్టు గిరిజన జన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు వినోద్‌నాయక్ తెలిపారు. ప్రభుత్వ వసతి గృహాలలో సమస్యలను పరిష్కరించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఆయన చెప్పారు. ఆయన వెంట కృష్ణనాయక్, రాజు, రవి, శేఖర్ తదితరులు ఉన్నారు.



ఘనంగా శ్రీరామ రక్షా స్తోత్ర పారాయణం



పారాయణం చేస్తున్న భక్తులు

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని కృష్ణాలయంలో రామకోటి భక్తసమాజం ఆధ్వర్యంలో శ్రీరామ రక్షా స్తోత్ర పారాయణ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. 108 మంది భక్తులు సామూహికంగా పారాయణంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ



చిన్నకోడూరులో భక్తులకు అక్షింతల పంపిణీ



పాలమాకులలో..

గజ్వేల్‌రూరల్/చిన్నకోడూరు(సిద్దిపేట)/నంగునూరు/బెజ్జంకి: అయోధ్య శ్రీసీతారాముల పూజిత అక్షింతల పంపిణీ కార్యక్రమం ఆదివారం జిల్లావ్యాప్తంగా పలు గ్రామాల్లో నిర్వహించారు. గజ్వేల్ మండల పరిధిలోని అహ్మదీపూర్‌లో భార్గవ పంతులు ఆధ్వర్యంలో ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బీజేపీ నాయకులు ఆకుల రాజయ్య, నరేష్, ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు. చిన్నకోడూరు మండల పరిధిలోని రామంచ, గంగాపూర్, చిన్నకోడూరు గ్రామాల్లో ఇంటింటికీ అక్షింతలను పంపిణీ చేశారు. అలాగే నంగునూరులోని కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చిన అక్షింతలను అన్ని గ్రామాలకు తరలించి హన్‌మాన్ దేవాలయంలో ఉంచారు. ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి ఇంటింటా తిరుగుతూ అక్షింతలు, శ్రీరాముని ప్రతిమను అందజేయగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. బెజ్జంకి మండలంలోని తోటపల్లి, గాగిళ్లాపూర్, బేగంపేట గ్రామాల్లో అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తోటపల్లి సర్పంచ్ నర్సింగరావు, గాగిళ్లాపూర్ ఎంపీటీసీ మల్లేశం, రమేష్, అజిత్‌రెడ్డి, గంప లవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక 'బృందావనం'

నేత్రపర్వంగా సంస్థాన పూజ

వర్గల్(గజ్వేల్): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నాచగిరి సమీప శ్రీరాఘవేంద్ర బృందావనంలో ఆధ్యాత్మికతలు వెల్లివిరిశాయి. ఉత్తరాధి మఠాధిపతి శ్రీసత్యాత్మతీర్థ శ్రీపాదులవారి సందర్శనతో భక్తిపారవశ్యం అలుముకుంది. స్వామివారి స్వహస్తాలతో కొనసాగిన శ్రీమఠం సంస్థానపూజతో భక్తిభావనలు ఉప్పొంగాయి. ఆదివారం సాయంత్రం బృందావనం సందర్శించిన స్వామివారికి తెలంగాణ మధ్వమండలి పరివారం, శ్రీరాఘవేంద్ర బృందావన సమితి సభ్యులు, భక్తజనులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. మొదట బృందావనంలో నూతన భవనాలకు, పునర్‌నిర్మించిన భవనాలకు స్వామివారు ప్రారంభోత్సవం చేశారు. భక్తులకు తప్త ముద్ర ధారణ చేశారు. అనంతరం శ్రీరాఘవేంద్రుని సన్నిధానంలో శ్రీమూల రామదేవుల సంస్థానపూజ నిర్వహించారు. మధ్వమండలి ప్రతినిధులు ఉపేందర్‌రావు, ప్రవీణ్‌కుమార్, నాచగిరి ఆలయ మాజీ చైర్మన్ హన్మంతరావు తదితరులు భక్తులకు ఇబ్బంది కలగకుండా పర్యవేక్షించారు.



సత్యాత్మతీర్థ స్వామి వారికి స్వాగతం పలుకుతున్న మధ్వమండలి ప్రతినిధులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990